అయ్యప్పకాలనీని ముంచెత్తిన వరదనీరు

● రెండు రోజులుగా వరదనీటిలో ప్రజల అవస్థలు

గ్రీన్‌టెర్రస్ అపార్ట్‌మెంట్‌లోకి చేరిన వరదనీరు

బండ్లగూడ అయ్యప్పకాలనీలోకి చేరిన వరదనీరు

జలమయమైన కాలనీలోని దేవాలయం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25: నాగోల్ డివిజన్‌లో మంగళవారం ఎడతెరిపిలేకుండా మూడు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. బండ్లగూడ పరిధి అయ్యప్పకాలనీని వరద నీరు ముంచెత్తడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. బుధవారం మోకాలి లోతుకు పైగా చేరిన వరదనీటిలోనే ప్రజలు రోజంతా గడిపారు. అనేక ఇండ్లల్లోకి వరదనీరు చేరింది. బండ్లగూడ గ్రీన్‌టెర్రస్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి వరదనీరు భారీగా చేరడంతో అపార్ట్‌మెంట్ వాసులు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉండటంతో అయ్యప్పకాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి భారీ వర్షం కురిస్తే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయోనని భయాందోళనకు గురవుతున్నారు.

కందుకూరు ఎంఈఓగా నరసింహ

కందుకూరు, సెప్టెంబర్ 25 : మండలంలోని లేమూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసంహ కందుకూరు మండల విద్యాధికారిగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన మనోహర్ రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలానికి బదిలీ అయ్యారు. బుధవారం విద్యాధికారి కార్యాలయంలో నరసింహ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుగ్గరాములు, చెన్నయ్య, లక్ష్మణ్‌నాయక్, శ్రీవాణి, రవి నూతన ఎంఈఓను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పీడీఎస్‌యూ ఉభయ జిల్లాల అధ్యక్షుడిగా సైదులు

మలక్‌పేట, సెప్టెంబర్ 25: పీడీఎస్‌యూ రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల అధ్యక్షుడిగా మందుల సైదులు నియమితులయ్యారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడియల్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల జనరల్ కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా సుమన్, ఉపాధ్యక్షుడిగా సుబ్రమణ్యం, సహాయ కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా ఉదయ్, మోహన్, శ్రీకాంత్, కో ఆప్షన్ సభ్యులుగా ఇద్దరిని నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మందుల సైదులు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే పీడీఎస్‌యూ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధుల విడుదలకు విద్యార్థుల పక్షాన పోరాడనున్నట్లు తెలిపారు.

ఎస్పీ బాలసుబ్రమణ్యంకు ఘన నివాళి

కందుకూరులో ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ సైదులు, నాయకులు, అభిమానులు

కందుకూరు, సెప్టెంబర్ 25 : ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతిని బుధవారం కందుకూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, బాలమల్లేశ్‌యాదవ్, కందుకూరు మాజీ ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, బావిరెడ్డి, ప్రశాంత్‌కుమార్, ఎస్పీబీ అభిమానులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా భిక్షపతిగౌడ్

ఆర్కేపురం,సెప్టెంబర్ 25 : టీపీసీసీ లీగల్ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా బొడ్డు భిక్షపతి గౌడ్ నియమిత్తులయ్యారు. ఈ మేరకు ఆయనకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాదులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటామన్నారు. ప్రజల్లో న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, మధుయాస్కి గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్స్‌గా నియమిత్తులైన బండి మధుసూదన్‌రావు, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గణేశ్ నాయక్‌ను బుధవారం పలువురు సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పీ. సైదులు, లింగస్వామిగౌడ్, ఎల్లన్న, శ్రీకాంత్‌రెడ్డి, భువనేశ్వర్ తదితరులు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. – ఆర్కేపురం, సెప్టెంబర్ 25

1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు

మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 25: అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి యం.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు.ఈనెల 26న వృద్ధాశ్రమాల్లో వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్ ర్యాలీ, 28, 29న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు, 30న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, అక్టోబర్ 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలి

● ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్‌రావు

మీర్‌ఖాన్‌పేట్‌లో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్‌రావు, ఇతర అధికారులు

కందుకూరు, సెప్టెంబర్ 25 : రైతులు ఆయిల్‌పామ్ తోటల సాగుపై దృష్టి పెట్టాలని ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్‌రావు అన్నారు. మండలంలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో రైతు సుధాకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయన ఆయిల్‌పామ్ మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు లాభసాటి పంటల సాగు చేపట్టాలన్నారు. ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తే నాలుగేండ్ల తర్వాత ఎకరాకు నెలకు రూ. 5 వేల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం డ్రిప్పుతో పాటు మొక్కలను రూ. 90 శాతం సబ్సిడీపై ఇస్తున్నదని చెప్పారు. ఎస్సీ,ఎస్టీలకు డ్రిప్పుకు 100శాతం, బీసీ ఇతరులకు 90శాతం వరకు సబ్సిడీ అందజేస్తుందని వివరించారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటలను కూడా సాగు చేయవచ్చని చెప్పారు. ఈ పంటకు చీడపురుగుల బెడద తక్కువగా ఉంటుందని, నాలుగేండ్ల వరకు ప్రభుత్వం రూ. 4,200 వరకు మెయింటెనెన్స్ ఖర్చు భరిస్తుందని వివరించారు. ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఉద్యాన శాఖ మండల అధికారి సౌమ్య, ఏపీఓ రవీందర్‌రెడ్డి, ఏఈఓ రాఘవేంద్రచారి, ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో డీడీఎంఎస్ కోఫేమ్‌లో సంగీత పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 25: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (కోఫేమ్)లో ఈనెల 28వ తేదీ నుంచి సంగీత పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ, ప్రిన్సిపాల్ కె.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 28న సీనియర్, సూపర్ సీనియర్ కేటగిరీలకు, 29న జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీలకు కర్ణాటక గాత్ర-వీణ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 94417 68811, 94413 86157 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువత గాంధేయ మార్గంలో పయనించాలి

పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గంలో యువత పయనించాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సూచించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న పాదయాత్ర పోస్టర్‌ను బుధవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజులపాటు వెయ్యి కిలోమీటర్ల మేర సాగనున్న ఈ పాదయాత్రలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బడే సాబ్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

స్వచ్ఛతా హీ సేవా కిట్ల అందజేత

బడంగ్‌పేట,సెప్టెంబర్ 25 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గాంధీనగర్‌లో బుధవారం విద్యార్థులకు డీఆర్‌డీఓ అధికారులు రాజాబాబు, ఆర్ వేణుగోపాల్ స్వచ్ఛతా హీ సేవా కిట్లను అందజేశారు. డైరెక్టర్ పీఎం డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో కార్యాలయ అధికారులు 150 కిట్లను అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ధనంజయ్ గౌడ్, బాలసుబ్రమణ్యం, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, మణెమమ్మ, రఘుపతి, యాదయ్య, మల్లేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు కార్మికులంతా పోరాడాలి

కందుకూరులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ తదితరులు

కందుకూరు, సెప్టెంబర్ 25 : చలో హైదరాబాద్, లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. బుధవారం కందుకూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. హక్కుల రక్షణకు కార్మికులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కనీస వేతన చట్టం సవరించి పెరిగిన ధరలకు అనుగుణంగా రూ. 26 వేతనం నిర్ణయించాలన్నారు. గుర్తింపు కార్డులతో పాటు పే స్లిప్‌లు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ఈ నెల 30న నిర్వహించే లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడికి కార్మికులంతా పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కవిత, మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల కన్వీనర్లు శేఖర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4 నుంచి దాండియా, బతుకమ్మ నైట్స్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 25 : దేశ సంప్రదాయ దాండియా, తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన బతుకమ్మ ఆటల మేళవింపుగా అక్టోబర్ 4 నుంచి 6 నార్సింగ్‌లోని ఓమ్ కనెక్షన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆరమ్ ఈవెంట్స్ సీఈవో కవితాశెట్టి తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లో మీడియా సమావేశంలో ఈవెంట్‌కు సంబంధించిన బ్రోచర్లు, టీజర్‌ను సినీనటుడు భరద్వాజ్, డీజే పీయూష్ బజాజ్ ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా సినీనటి శ్రీముఖి నేతృత్వంలో బతుకమ్మ ఆటలు, లైఫ్, లైవ్ మ్యూజిక్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్వప్న రెడ్డి, పీత్రి, వెంకట్ పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

ఫార్మాసిస్టులు, కెమిస్ట్‌లను సన్మానిస్తున్న డాక్టర్ కృష్ణకుమార్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25: ఫార్మాసిస్టులు, కెమిస్ట్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ కోరారు. ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా బుధవారం ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని మెడికల్ షాపుల యాజమాన్యాలు, సిబ్బందిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపత్కర సమయాల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న ఫార్మాసిస్టులు, కెమిస్ట్‌ల సేవలు అభినందనీయమన్నారు. పలువురు ఫార్మాసిస్టులు, కెమిస్ట్‌లు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

ఉప్పల్, సెప్టెంబర్ 25: విజయవాడలోని వరద బాధితులకు ఈసీఐఎల్ చౌరస్తాకు చెందిన సోలీస్ కంటి వైద్యశాల, ఆర్ఎస్ స్టీల్ సిండికేట్ ఆధ్వర్యంలో రూ. 5లక్షలు విలువ చేసే నూతన దుస్తులను పంపిణీ చేశారు. విజయవాడలోని రాజరాజేశ్వరపేట, అజిత్‌సింగ్ నగర్‌లో సోలీస్ కంటి వైద్యశాల చైర్మన్ నందనంపాటి రామంజనేయులు, ఆర్ఎస్ స్టీల్ సిండికేట్ ఎండీ బాలమురళీ కృష్ణ, పోనూర్ రోహిత్‌ల ఆధ్వర్యంలో నూతన దస్తువులతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుంట శ్రీ గొల్లఅంజనేయ స్వామి ట్రస్ట్ ప్రతినిధులు పుల్లారావు, మద్దాల కామేశ్వర్‌రావు, సీతారాం గుప్తా, కిశోర్, పురుషోత్తం, రఘు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం..

మల్కాజిగిరి: వరద బాధితులకు అండగా ఉంటామని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం మల్కాజిగిరిలో ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం కళాకారులు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో అక్షయ్, రాజు, యాకన్న, రమేశ్, ఎండి సయ్యద్, శ్రీకాంత్, ఉమేశ్, ప్రభాకర్, మల్లేశ్ పాల్గొన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 25 : రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం వర్సిటీ ఆడిటోరియం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో రిజిస్ట్రార్ పాల్గొన్నారు. యవ్వన దశ నుంచి 50 ఏండ్ల వరకు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని రిజిస్ట్రార్ సూచించారు. పీజేటీఎస్ఏయూ, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన ఆధ్వర్యంలో ఈ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు.

అర్హులందరికీ మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీలు

లబ్ధిదారులకు సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న మలక్‌పేట సర్కిల్ ఏఎస్‌వో నర్సింగ్‌రాజ్

సైదాబాద్, సెప్టెంబర్ 25 : పౌర సఫరాల శాఖ మలక్‌పేట సర్కిల్ పరిధిలో వినియోగదారులకు రేషన్ సక్రమంగా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్కిల్ ఏఎస్‌వో ఆకుల నర్సింగ్‌రాజ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ పత్రాలను బుధవారం ఆయన అర్హులైన లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో మొత్తం 68,875 కుటుంబాలు ఆహార భద్రత కార్డులు కలిగి ఉన్నారని, ఇందులో 3,892 మందికి అంత్యోదయ కార్డులు, అన్నపూర్ణ పథకం కింద 1,206 మందికి, 63వేల తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి సర్కిల్ పరిధిలో 21,532 మందిని గ్యాస్ సబ్సిడీకి అర్హులుగా గుర్తించి వారికి నేరుగా ఫోన్ ద్వారా సమాచారం అందించామని చెప్పారు. దాంతో గ్యాస్ రాయితీ నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతుందన్నారు. కాగా ఇప్పటికే 20వేల మందికి సబ్సిడీ పత్రాలను అందజేశామని, మిగిలిన వారికి కూడా త్వరలోనే అందజేస్తామని ఆయన తెలిపారు. సర్కిల్ పరిధిలో 69 రేషన్ దుకాణాలున్నాయని, అంత్యోదయ కార్డు ఉన్న వారికి 35 కేజీల బియ్యం, అన్నపూర్ణ కార్డు వారికి 10 కేజీల బియ్యం, ఆహార భద్రత కార్డు కలిగిన కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ 6 కేజీల చొప్పున బియ్యం ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. అక్రమాలకు పాల్పడే రేషన్ డీలర్ల సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రజలకు సూచించారు.

సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ కార్యనిర్వాహక కార్యదర్శిగా నరేశ్‌నాయక్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25: సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎల్బీనగర్‌కు చెందిన జటావత్ నరేశ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎల్బీనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చామకూర రాజు, రాష్ట్ర కన్వీనర్ కేవీ గౌడ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్‌నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలకు అరవై ఏండ్ల కష్టాలు మొదలయ్యాయన్నారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేముల కొండల్‌గౌడ్ తదితరులున్నారు.

ఇండోర్ పర్యటనలో గ్రేటర్ బృందం

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 25 : హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బృందం స్టడీ టూర్ చేపడుతున్నారు. స్వచ్ఛతలో 7 సార్లు జాతీయస్థాయి అవార్డులు గెల్చుకున్న ఇండోర్ మున్సిపాలిటీని బుధవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్.రెడ్డితో పాటు నగరానికి చెందిన పలువురు కార్పొరేటర్లు సందర్శించారు. ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో పాల్గొని స్వచ్ఛతపై చర్చించారు.

విషజ్వరాలతో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బి. మేనక, డాక్టర్ అర్చనాదినేశ్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25: వర్షాకాలంలో ప్రబలే విషజ్వరాలు డెంగీ, చికున్‌గున్యాపై గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బి. మేనక, డాక్టర్ అర్చనాదినేశ్ తెలిపారు. గర్భిణులకు పౌష్టికాహారం ఆవశ్యకత, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆస్పత్రి ఇందిరా ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భం దాల్చిన మూడు నుంచి ఐదు నెలల సమయంలో వచ్చే జ్వరాలు ప్రమాదకరమైనవని తెలిపారు. రెండు రోజుల పాటు జ్వరం తగ్గనట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గర్భిణుల్లో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉంటుందని తల్లీ బిడ్డల సంరక్షణ కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు ముఖ్యంగా డాక్టర్ల సూచించిన మందులనే వాడాలన్నారు. వర్షాకాలంలో బయటకు వెళ్లాల్సి వస్తే మాస్కులు ధరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నలత, డాక్టర్ వాసవి పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల పట్టాల సాధనకు కృషి

కాప్రా, సెప్టెంబర్ 25: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లపట్టాలు ఇప్పించడానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కృషిచేస్తుందని, అందుకోసం జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం మల్లాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో యూనియన్ నియోజకవర్గం అధ్యక్షుడు పల్లా మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉప్పల్ నియోజకవర్గం జర్నలిస్టుల సమావేశానికి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇండ్లపట్టాలు ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాలు లభించేలా కృషిచేస్తామని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు చర్చించడానికి త్వరలో సీఎంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో టీయూడబ్లుజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, జిల్లాకమిటీ ప్రతినిధులు కేసీ మోహన్, శ్రీనివాస్, ఆదిమూలం శ్రీనివాస్, అక్బర్, చంద్రమౌళి, విజయ్, శ్రీధర్, కాప్రా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఉప్పల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి నరోత్తంరెడ్డి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

కందుకూరు, సెప్టెంబర్ 25 : మండలంలోని నేదునూరు మండల ప్రభుత్వ మాడల్ స్కూల్,కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన విష్ణుప్రియకు బుధవారం వైస్ ఎంపీపీ గంగుల శమంతాప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ అష్టల్ బేగ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రూప్‌చందర్, సురేశ్, బాబు, రాములు, దర్శన్, అజారుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులను అడ్డుకున్న స్థానికులు

ఉప్పల్, సెప్టెంబర్ 25: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు కొన్ని రోజులుగా ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఇందులోభాగంగా కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం మల్లాపూర్ శివ హోటల్ నుంచి ఓల్డ్ మల్లాపూర్ వైపు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. స్థానికులు ఆక్రమణలను తొలగించొద్దని టౌన్ ప్లానింగ్ అధికారులను అడ్డుకున్నారు. దాంతో అధికారులు వారిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**బహిరంగ ప్రకట